క్లుప్తంగా

వైభవంగా పల్లకీ సేవ



స్వామి వారి పల్లకీ ఊరేగింపు

ఉరవకొండ రూరల్: ప్రసిద్ధి చెందిన పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి పల్లకీ సేవ శనివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం పలు రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో శ్రీదేవి భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం డప్పు వాయిద్యాలు, మేలతాళాల నడుమ ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గవిమఠం పీఠాధిపతి జన్మదిన వేడుకలు



చెన్నబసవరాజేంద్రను గజమాలతో సత్కరించిన ఆలయాధికారులు, వీరశైవులు

ఉరవకొండ: ఉరవకొండ గవిమఠం యాదవగిరి శూన్య సింహాసనాధీశ్వరులు 8వ పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్ర మహాస్వామి 98వ జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించారు. తుంకూరు ఉపమఠంలో గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి, ఆదోని చౌకి మఠం పీఠాధిపతులు కళ్యాణస్వామిజీ, మఠం ఏజెంట్ రాజన్న గౌడ్, సహాయ కమిషనర్ రాణి ఆధ్వర్యంలో స్వామిని సత్కరించారు. వీరశైవ సంఘం నాయకులు నిరంజన్‌గౌడ్, సిబ్బంది గోపి, నారాయణస్వామి, మధు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జలధి పూజ



సెలయేటి నుంచి జలధిపూజ కలశాన్ని మోసుకొస్తున్న అర్చకుడు

బొమ్మనహాళ్: మండలంలోని ఎర్రగుడిలో గిరినాథ స్వామి జలధి పూజ శనివారం నిర్వహించారు. గ్రామ సమీపంలోని సెలయేటిలో గంగపూజ చేసి, కలశంలో గంగను నింపుతారు. పూనకంతో ఉన్న అర్చకులు కలశాన్ని మోస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ధ్వజస్తంభం వద్ద నల్లరేగడి భూముల్లో సాగు చేసే పంట ధాన్యాలను ఉంచి పూజలు అనంతరం పప్పుశనగ, ధనియాలు, కంది పంటలు బాగా పండుతాయని అర్చకులు భవిష్యవాణి తెలిపారు. జలధిపూజలో భాగంగా అన్నదానం చేశారు.

ఎలక్ట్రానిక్ కాటాల తనిఖీ



కాటాలకు స్టాంపింగ్ వేస్తున్న తూనికలు, కొలతలశాఖ అధికారి శంకర్

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలోని డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం, రూరల్ పరిధిలోని 133 చౌక డిపోల ఎలక్ట్రానిక్ కాటాలను తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ భవనంలో పట్టణంలోని 23, రూరల్ పరిధిలో 32, గుమ్మఘట్ట మండలంలోని 44, డి.హీరేహాళ్ మండలంలోని 34 చౌక ధాన్యపు డిపో డీలర్లు బరువు కాటా యంత్రాలను తీసుకురాగా, వాటిని తనిఖీ చేసి స్టాంపింగ్ చేశారు.

ఐటీఐ కళాశాలలో స్నాతకోత్సవం



ఐటీఐ కళాశాల స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్నాతకోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డీజేబీ రవీంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అక్రాఫ్అలీ హాజరై మాట్లాడారు. ప్రిన్సిపాల్ రవీంద్ర మాట్లాడుతూ ఐటీఐలో చేరితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందించారు. అధ్యాపకులు దుర్గాప్రసాద్, మోహబుబీబీ, తిరుపత య్య, రవికుమార్, విజయ్‌కుమార్, శ్రీనివాసు లు, రామాంజనేయులు, చంద్రశేఖర్, శ్రీరేఖ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కుందుర్పి: మండలంలోని విద్యార్థులకు ఎర్రగుంటకు చెందిన యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ డైరెక్టర్ జయన్న స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. గురుకుల ప్రవేశ పరీక్షల స్టడీ మెటీయల్‌ను స్థానిక ఎంఈఓలు లక్ష్మీదేవి, తిప్పేస్వామి విద్యార్థులకు అందజేశారు.

ప్రాణాంతకం..క్రిమిసంహారకం

- క్రిమి సంహారక మందుల వినియోగంతో ముప్పు
- జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవు

బొమ్మనహాళ్: ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పంట సాగు చేసినా రసాయనాల వాడకం తప్పనిసరి. అయితే క్రిమి సంహారక మందులు వాడకంలో రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్కోసారి మరణాలు కూడా సంభవిస్తాయని చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో పంటల్లో ఎరువులు, మందులు పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారి సాయికుమార్ జాగ్రత్తలు తెలియజేశారు.

రసాయనాలతో అనారోగ్య సమస్యలు:

పంటలను ఆశించే చీడపీడల నివారణకు రైతులు క్రిమిసంహారక మందులు వేస్తుంటారు. ఇలాంటి తరుణంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రాణాలకే ముప్పు వచ్చే అవకాశం ఉందని చెప్తున్నారు. పరోక్షంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందంటున్నారు. కళ్లు తిరగడం, వాంతులు చేసుకోవడం, కాలేయం పెరుగుదల, నరాల బలహీనత తదితర సమస్యలొచ్చే ప్రమాదం ఉంది. పిచికారీ చేసే వ్యక్తులకే కాకుండా వాటిని వినియోగించే ప్రతి ఒక్కరూ అనారోగ్యంబారిన పడతారని చెప్తున్నారు.

సేంద్రీయ ఎరువులే మేలు :

పంటల సాగులో సేంద్రియ విధానాలు అనుసరించడం వల్ల నేల దెబ్బతినదు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యకర ఉత్పత్తులు సాధించొచ్చు. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేయడం వల్ల పెట్టుబడి వ్యయం సగానికి పైగా తగ్గుతుంది. పశువుల వ్యర్థాలు, వేపాకు కషాయం, పచ్చిరొట్ట ఎరువులు, వర్మీకంపోస్టు వినియోగించడం ద్వారా భూసారం పెరుగుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

మందులు పిచికారీ చేసే సమయంలో శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించాలి. ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలి. పిచికారీ సమయంలో నీరు తాగడం, భోజనం చేయరాదు. మందులను కలిపేటప్పుడు కర్రతో కలపాలి. ఆహార పదార్థాలతో పాటు మందులను రవాణా చేయరాదు. గాలి వీచే దశలోనే ద్రావణం పిచికారీ చేయాలి. నాజిల్స్‌ను శుభ్రపరచడానికి నోటితో గాలిని ఊదరాదు. మందు కళ్లలో పడితే వెంటనుఏ మంచి నీటితో శుభ్రం చేసుకోవాలి. మందుల డబ్బాలను ఖాళీ అయిన వెంటనే గొయ్యి తీసి పాతి పెట్టాలి. విష ప్రభావానికి గురైతే ప్రథమ చికిత్స కోసం వైద్యులను సంప్రదించాలి.



వరి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

రైతులు అప్రమత్తంగా ఉండాలి



పంటలకు కావాల్సినంత నీరు అందక పోతే చీడపీడలు అధికమయ్యే అవకాశం ఉంది. తొలిదశలోనే తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి.

– సాయికుమార్, వ్యవసాయాధికారి, బొమ్మనహాళ్

కూటమి హామీలపై నిలదీయండి

రాయదుర్గంటౌన్: కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలపై నిలదీయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని 4, 5 వార్డుల్లో కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను విస్మరించి ఏ విధంగా మోసం చేస్తున్నాడో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఏడాది తర్వాత అరకొరగా అమలు చేసిన పథకాలైనా పేదలకు సక్రమంగా అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేదని నాయకులు అన్నారు. పాలన చేతకాక ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.



ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ నేతలు

కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, శారదాదేవి, పొరాళ్ల గోవిందరాజులు, ఫకృద్దీన్, కోఆప్షన్ సభ్యుడు నజీర్, మాజీ కౌన్సిలర్ వసంతరాజులు, వార్డు ఇన్‌చార్జ్‌లు అరవా శివప్ప, గౌని శ్రీరామిరెడ్డి, రామాంజనేయులు, బషీర్ అహ్మద్, గోనబావి నిజాముద్దీన్, సిద్దప్ప, పట్టణ యూత్ అధ్యక్షుడు అరవింద్‌బాబు, ప్రచార కార్యదర్శి తిప్పేస్వామి, జలంధర్ రెడ్డి, బంగి రమేష్, కొలిమి ఆనంద్, చంద్రశేఖర్ రెడ్డి, పైతోట రాజు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో గర్భకోశ వ్యాధుల నివారణ

- జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ ప్రేమ్ చంద్

కూడేరు: ముందస్తు జాగ్రత్తలతో పశువుల్లో గర్భకోశ వ్యాధులను నివారించొచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్ చంద్ అన్నారు. శనివారం కమ్మూరులో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా పశు వైద్యాధికారి ప్రేమ్ చంద్ శిబిరాన్ని సందర్శించి, పశువులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పశువుల్లో గర్భకోశ వ్యాధులతో పాడి పెంపకందారులు తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుందన్నారు. గాలికుంటు వ్యాధి నివారణకు పశువుల పెంపకందారులు తప్పక టీకా వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగారెడ్డి, ఈఓడీఎల్‌డీఓ డాక్టర్ వెంకటేష్, సంయుక్త సంచాలకులు డాక్టర్ పద్మనాభం, సుబ్రమణ్యం, పశు వైద్యాధికారులు శ్రీనివాసులు, శ్రీకాంత్, ఏహెచ్‌ఏలు రామాంజనేయులు, దామోదర్, భవాని, రాఘవ, ఓఎస్ విజయలక్ష్మీ, ఎంఎస్‌డీ ఎగ్జిక్యూటివ్ నారాయణ స్వామి పాల్గొన్నారు.



కమ్మూరులో మందులు అందిస్తున్న పశు సంవర్ధకశాఖ జేడీ ప్రేమ్‌చంద్

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచాలి



ఉరవకొండ కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి



కళ్యాణదుర్గం కోర్టు ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న న్యాయమూర్తి భాను

- ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి

ఉరవకొండ: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచాలని ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి సూచించారు. శనివారం వనమహోత్సవం నిర్వహించారు. ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి ఆధ్వర్యంలో బార్ సభ్యులు, పోలీసులు మొక్కలు నాటారు. ఫారెస్టు శాఖ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కళ్యాణదుర్గం రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి భాను అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జడ్జి భాను, ఫారెస్ట్ అధికారులు, కోర్టు సిబ్బంది, లాయర్లు కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, ఫారెస్ట్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులు మొక్కలు బాధ్యతగా పెంచాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య తెలిపారు. శనివారం పట్టణలలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహి ంచారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు శ్రీధర్, రవిశంకర్, అధ్యాపకులు షౌకత్ అలీ, మౌనిక సాయి, చాముండేశ్వరి, చిట్టిబాబు, మహ్మద్ అలీ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్:స్వచ్ఛ రాయదుర్గం..స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ప్రజలదరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పిలుపునిచ్చారు.శనివారం పట్టణంలోని ముత్తరాసి కాలనీ, పార్వతీనగర్‌లో మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ సురేష్, ఏఈ నరసింహులు, కౌన్సిలర్లు గౌని లావణ్య, శారదాదేవి, శ్రీలక్ష్మీ, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పొరాళ్ల శివకుమార్, రామాంజనేయులు, గౌని శ్రీరామిరెడ్డి, దివాకర్, నిజాముద్దీన్ పాల్గొన్నారు. కేటీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ మొక్కలు సంరక్షించాలని ఎంపీడీఓ విజయభాస్కర్, తహసీల్దార్ముని వేలు అన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ దాస్, ఏపీఓ లక్ష్మీకాంతబాయి, హెచ్‌ఎం ఆదిశేషయ్య, పంచాయతీ కార్యదర్శి శివన్న, మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

కుందుర్పి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని తహసీల్దార్ ఓబుళేసు, ఎంపీడీఓ లక్ష్మీశంకర్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఏఓ బాలాజీ, ఏపీఓ మురళీ, ఈసీ వెంకటరమణ ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కూడేరు: కూడేరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, సర్పంచ్ లలితమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ రాధాకృష్ణ, ఏపీఓ పోలేరయ్య, పీఆర్ ఏఈ రమణయ్య, ఈసీ రాజేష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యం



కాలువపల్లిలో పోషణమాసం ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బొమ్మనహాళ్: పౌష్టికాహారంపై తెలియజేస్తున్న సీడీపీఓ నాగవేణి

రాయదుర్గంటౌన్: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని రాయదుర్గం ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మావతి అన్నారు. శనివారం పట్టణంలోని మదర్‌థెరిసా అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ అధ్యక్షతన 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరత్నమ్మ అంగన్‌వాడీ టీచర్ చంద్రమతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ నాగవేణీ తెలిపారు. శనివారం మండలంలోని ఉద్దేహాళ్, దేవగిరి గ్రామాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ శాంతకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, లక్ష్మీ, నాగవేణి పాల్గొన్నారు.

బెళుగుప్ప: కాలువపల్లిలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి, వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోషణ్ మాసోత్సవం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, అంగన్‌వాడీ వర్కర్‌లు, హెల్పర్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే అన్ని సేవలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సురేఖ తెలియజేశారు. శనివారం కూడేరులో పోషణ మహోత్సవాల్లో భాగంగా డిజిటలీకరణపై అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు.

వజ్రకరూరు: మండలంలోని కమలపాడులో పోషణ మాసోత్సవాలపై శనివారం అవగాహన ర్యాలీ చేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాల నుంచి మె యిన్ రోడ్ మీదుగా గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రబియా, హెచ్‌ఎం లక్ష్మణమూర్తి, అంగన్‌వాడీ కార్యకర్తలు నీరజ, సరస్వతి, పద్మావతి, ఏఎన్‌ఎంలు భ్రమరాంబ, జయమ్మ, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సమాధుల రాళ్లు ధ్వంసం

ఉరవకొండ: మండలంలోని వెలిగొండ రోడ్డు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలో జేసీబీతో ముళ్ల కంపలు తొలగిస్తుండగా సమాధుల రాళ్లు కదిలాయి. శ్మశానంలో ముళ్లకంపలు పెరిగి, అందులోకి అడుగుపెట్టలేని పరిస్థితి. దీంతో పాలకవర్గ సభ్యులు, పట్టణానికి చెందిన వారు ముళ్లకంపలు తొలగించాలని ఈఓ గౌస్‌సాహెబ్‌కు విన్నవించారు. వెంటనే జేసీబీలు ఏర్పాటు చేసి ఈఓ శ్మశాన వాటికలో ముళ్లకంపలు జేసీబీతో తొలగిస్తుండగా, రాళ్లు ధ్వంసమయ్యాయి. మృతదేహాన్ని ఖననం చేసిన చోట సమాధి రాళ్లు కదిలాయి. సమాధులు ఎవరివనేది గుర్తు పట్టలేని విధంగా మారిపోయిందని స్థానికులు అంటున్నారు. దీనిపై ఈఓ గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ జేసీబీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఇలా జరిగిందని, దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు.



హిందూశ్మశాన వాటికను శుభ్రం చేసిన సమయంలో ధ్వంసమైన సమాధుల రాళ్లు

మహిళల మేలుకోసమే ప్రత్యేక వైద్యశిబిరాలు

వజ్రకరూరు: మహిళల ఆరోగ్యం కోసమే ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి సర్దార్‌వలి తెలిపారు. శనివారం మండలంలోని పందికుంటలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్ సుశీలమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు అమృత, భారతి, బాలచౌడేశ్వరి, ఏఎన్‌ఎం సురేఖ, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని భైరవానితిప్ప, గుండిగానిపల్లి గ్రామాల్లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేర్, ఏఎన్‌ఎంలు శశికళ, మహాలక్ష్మి, లింగమ్మ, సువర్ణమ్మ, ఎంఎల్ హెచ్‌పీలు ద్రాక్షాయణి, ఉపేంద్ర, మృధుళ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మిస్సింగ్ కేసు నమోదు

కూడేరు:మండల పరిధిలోని పి.నాగిరెడ్డిపల్లికి చెందిన మీసుగ ఆనంద్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపారు. ఆనంద్ ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్లా వెతికినా ఫలితంలేకపోవడంతో ఫిర్యాదు చేశారు.

రేపు యూరియా పంపిణీ

కుందుర్పి: మండల కేంద్రంలో సోమవారం మండల రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు ఏఈఓ కులశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు యూరియా పంపిణీ ఉంటుందన్నారు. బస్తా రూ.270 చొప్పున రైతుకు రెండు బస్తాల చొప్పున అందిస్తున్నామన్నారు. రెండు రోజులుగా ఎనుములదొడ్డి సచివాలయంలో యూరియా పంపిణీ జరిగిందన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

గుమ్మఘట్ట: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఈ నెల 23న గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు.

ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలి



తీర్మాన ప్రతిని అందిస్తున్న దృశ్యం

కుందుర్పి: ఆర్డీటీ సేవలు కొనసాగించాలని అప్పిలేపల్లి గ్రామ సర్పంచ్ అతావుల్లా, ఎంపీటీసీ కెంచమ్మ, గ్రామ సచివాలయ సిబ్బంది శనివారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన ప్రతిని ఎంపీడీఓ శంకర్‌కు అందించారు. వారు మాట్లాడుతూ ఆర్డీటీ లక్షలాది మంది పేదలకు 55 ఏళ్లుగా విద్య, వైద్య, వ్యవసాయ రంగం, పేదల సంక్షేమంపై ఎంతో సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

శనీశ్వరస్వామికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు భగసింగ్ కాలనీలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. రాయదుర్గం ప్రాంత పరిసరాల్లో శనీశ్వరాలయం ఒక్కటే ఉండడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బోధన స్థాయిని పెంపొందించుకోవాలి

కూడేరు: బోధన స్థాయిని పెంపొందించుకోవాలని ఎంఈఓ–2 సాయి కృష్ణ తెలిపారు. శనివారం ఆయన కూడేరులోని కేజీబీవీని సందర్శించారు. అక్కడ 6 నుంచి 9వ తరగతి వరకు అమలవుతున్న పాల్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి ఉమాదేవి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గురుప్రసాద్, సూపర్‌వైజర్ నాగశంకర్, వైద్యసిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి గౌరసంద్రం మారెమ్మ ఉత్సవాలు

ఉరవకొండ: మండలంలోని బూదగవి గౌరసంద్ర మారెమ్మ ఆలయ జలధి, బిందె పూజ, ఆలయ 56వ వార్షికోత్సవం నేటి నుంచి జరగనున్నాయి. ఈనెల 21 నుంచి 24 వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు రాము, అర్చకులు దేవరాజ్, బూదగవి గ్రామ పెద్దలు శనివారం తెలిపారు. 21న అమ్మవారికి విశేష పూజలతో పాటు గంగాజలంతో అమ్మవారికి అభిషేకం, 22న మారెమ్మ ఆలయం నుంచి ఉరవకొండ బైపాస్ వద్ద ఉన్న రాములమ్మ ఆలయం వరకు జలధి, బిందెపూజ చేశారు. 23న అమ్మవారి మహా కుంభారాధన పూజా మహోత్సవం, 24న గ్రామ వీధుల్లో గ్రామోత్సవం ఉంటుంది.

ప్రొటోకాల్‌పై ఫిర్యాదు చేస్తాం

వజ్రకరూరు: ప్రొటోకాల్ పాటించని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు రాగులపాడు వైఎస్సార్‌సీపీ సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి తెలిపారు. శనివారం రాగులపాడులో వారు విలేకరులతో మాట్లాడారు. రాగులపాడులో స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. అధికారుల ఆహ్వానం మేరకు తాము కార్యక్రమానికి హాజరయ్యామని, అయితే అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని సర్పంచు, ఎంపీటీసీలు అన్నారు. దీనిపై సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచు, ఎంపీటీసీలు తెలిపారు.

పైప్‌లైన్ లీకేజీ



తాగునీటి పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీ

రాయదుర్గంటౌన్:పట్టణానికి తాగునీరు సరఫరా చేసే కణేకల్లులోని ఎస్ఎస్ ట్యాంకు వద్ద పంపింగ్ పైప్‌లైన్‌కు భారీ లీకేజీ ఏర్పడింది. దీంతో శనివారం మధ్యాహ్నం నీటి సరఫరాకు బ్రేక్ పడింది. లీకేజీ కారణంగా ఆదివారం పట్టణంలో నీటి సరఫరా జరగదన్నారు. లీకేజీ ఏర్పడిన చోట ఆరు మీటర్ల మేర పీఎస్‌సీ పైప్ మార్చాల్సి ఉన్నందున యుద్ధ ప్రాతిపదికన నీటి సరఫరా విభాగం సిబ్బంది పనులు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఏఈ నరసింహులు తెలిపారు. పనులు పూర్తి చేసి సోమవారం నుంచి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

బ్యాంకర్లను దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

కూడేరు: స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో శనివారం ఆత్మకూరు మండలం సింగంపల్లికి చెందిన నారాయణ స్వామి అనే ఖాతాదారుడు బ్యాంకర్లను దుర్భాషలాడాడు. దీంతో అతనిపై మేనేజర్ రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు..నారాయణ స్వామి రెండేళ్లుగా బ్యాంకు ఖాతా ద్వారా లావాదేవీలు జరపలేదు. కనీసం మినిమం నగదు నిల్వ ఉంచలేదు. శనివారం తన ఖాతాలోకి రూ. లక్ష జమ చేశాడు. వెంటనే అతని ఖాతా నుంచి రూ.2 వేలు కట్ అయ్యింది. గమనించిన అతను బ్యాంకర్ల దృష్టికి తీసుకెళ్లడంతో వారు మినిమం బ్యాలెన్స్ లేకపోవడంతో ట్యాక్స్ రూపంలో రూ.2 వేలు కట్టయ్యిందని స్టేట్‌మెంట్ చూపారు. దీంతో కోపోద్రిక్తుడైన నారాయణస్వామి.. మహిళా సిబ్బందిని దూషించాడు. ఫీల్డ్‌ఆఫీసర్ సర్దిచెప్పేందుకు చూసినా ఫలితంలేకపోయింది.

కుక్కలదాడిలో గొర్రెపిల్లల మృతి



మృతి చెందిన గొర్రెలు

కళ్యాణదుర్గం (కంబదూరు): కంబదూరు మండలం కర్తనపర్తిలో శుక్రవారం రాత్రి గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. దాదాపు 30 గొర్రెల పిల్లల మెడలు కొరికేశాయి. గ్రామానికి చెందిన మహేంద్ర గొర్రెలు పోషిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. రాత్రి సమయంలో గొర్రెల మందలోకి కుక్కలు దూరి సుమారు 30 గొర్రె పిల్లల మెడలు కొరికేశాయి. దీంతో రూ.2 లక్షలకు పైగా నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని మహేంద్ర కోరుతున్నాడు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బ్రహ్మసముద్రం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బ్రహ్మసముద్రం : జిల్లా కేంద్రంలోని పీటీసీ మైదానంలో శుక్రవారం జరిగిన సౌత్ జోన్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి పోటీల్లో బ్రహ్మసముద్రం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని జి.శకుంతల 100 మీటర్ల పరుగు పందెంలోనూ, లాంగ్ జంప్‌లో (4.29 మీ. దూకి) మొదటి స్థానంలో నిలిచింది. కె. అరవింద్ యూ –18 విభాగంలో లాంగ్ జంప్ పోటీల్లో 5.35 మీ.దూకి రెండో స్థానంలో నిలిచి, ఇద్దరూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 27న ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం చంద్రమౌళి, పీఈటీ ఇబ్రహీం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విజయలక్ష్మీ, వేదావతి, చిట్టెమ్మ , గంగా పాల్గొన్నారు.

వెలవెలబోయిన సచివాలయం

వజ్రకరూరు: చిన్నహోతూరు సచివాలయంలో శనివారం సిబ్బంది లేక వెలవెలబోయింది. సచివాలయంలో గ్రామ కార్యదర్శితోపాటు మరో ఎనిమిది మంది ఉద్యోగులు విధుల్లో ఉండాల్సి ఉంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉండాల్సి ఉంది. మధ్యాహ్నం 3గంటల సమయంలో డిజిటల్ అసిస్టెంట్ మినహా ఎవరూలేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు నిరాశగా వెళ్లిపోయారు. దీనిపై ఎంపీడీఓ శివాజీరెడ్డిని అడగ్గా, ఆయన దీనిపై విచారించనున్నట్లు తెలిపారు.